పారిశుద్ధ్య కార్మికుల ఆకలి కేకలు

- గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి అందని వేతనాలు
- కుటుంబ పోషణ కోసం అవస్థలు
- నిలిచిన సబ్బులు, గ్లౌజులు, మాస్క్‌లు, కొబ్బరి నూనె సరఫరా
- నిరసనలు, ధర్నాలు చేస్తున్నా పట్టించుకోని అధికారులు



ఎస్.కోట మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, సీఐటీయూ నేతలు(ఫైల్)

ఎస్.కోట నియోజకవర్గంలో గ్రీన్ అంబాసిడర్ల వివరాలు

మండలం	గ్రీన్ అంబాసిడర్లు
వేపాడ	76
ఎస్.కోట	82
ఎల్.కోట	76
కొత్తవలస	87
జామి	91


వేపాడలో చెత్త సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్ (ఫైల్)

వేపాడ: గ్రామాల్లో నిత్యం ఉదయాన్నే చెత్తాచెదారం ఊడ్చి, వీధి కాలువల్లో పూడిక, వ్యర్థాలను, వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగిస్తూ వ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్య పరిరక్షణకు పరోక్షంగా పాటు పడుతున్న గ్రీన్ అంబాసిడర్లు కుటుంబ పోషణ కోసం అవస్థలు పడాల్సి వస్తోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు పస్తులు ఉండాల్సి వస్తోంది. అసలే చాలీచాలని వేతనం, అది కూడా నెలల తరబడి ఇవ్వకపోతే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు.ఎస్.కోట నియోజకవర్గంలోని వేపాడ, లక్కవరపుకోట, కొత్తవలస శృంగవరపుకోట, జామి మండలాల్లో 429 మంది గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో వీరందరినీ 2018లో నెలకు రూ.6వేల వేతనానికి నియమించారు. ప్రారంభంలో వీరికి వేతనాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేసేవారు. అయితే కొన్నాళ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వం వీరికి వేతనాల చెల్లింపుల బాధ్యతను పంచాయతీలకు అప్పగిం చింది.నాటి నుంచి వీరికి సకాలంలో వేతనాలు అందడం లేదు. వీరికి పంచాయతీలు నెలనెలా వేతనాలు చెల్లించాలనే నిబంధ న ఉన్నప్పటికీ పలు పంచాయతీల్లో ప్రస్తుతం 2 నుంచి 6 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో గ్రీన్ అంబాసిడర్లకు సబ్బులు, గ్లౌజులు, మాస్క్‌లు, కొబ్బరి నూనె, తదితర సామగ్రి సరఫరా చేసే వారు. ప్రస్తుతం వాటికి కూడా కోత విధించారు. గ్లౌజ్‌లు, మాస్కులు ఇవ్వకపోవడంతో చెత్త సేకరణ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చేతులు శుభ్రం చేసుకోవడానికి సబ్బులు కూడా ఇవ్వడం లేదని గ్రీన్‌అంబాసిడర్లు వాపోతున్నారు. వేతనం అందకపోయినా సొంత డబ్బుల నుంచి గ్లౌజ్‌లు, మాస్కులు కొనుక్కుంటున్నామని పలువురు గ్రీన్‌అంబాసిడర్లు చెబుతున్నారు.

కొనసాగుతున్న నిరసనలు, ధర్నాలు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషిచేస్తున్న తమకు వేతనాలు ఇవ్వకుండా, సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం తమపై చిన్నచూపు చూడడం సరికాదని అంటూ గ్రీన్ అంబాసిడర్లు తరచూ మండల పరిషత్ కార్యాలయాలు, సచివాలయాల వద్ద నిరసనలు, ధర్నాలు చేస్తున్నారు. మండల పరిషత్, సచివాలయాల అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, గ్రీన్ అంబాసిడర్లను కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాలని, సుప్రీం తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీఓలు 57, 132, 142, 551, 680లను అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారికి రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, దహన ఖర్చుల కోసం రూ.15 వేలు చెల్లించాలని, టెండర్ విధానం రద్దు చేయాలని, రిక్షాల మరమ్మతులు ఖర్చులు పంచాయతీలే భరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్ని ధర్నాలు చేసినా, ఎంత నిరసన తెలిపినా గ్రీన్‌అంబాసిడర్లకు మాత్రం పెండింగ్ వేతనాలు అందడం లేదని, వారి డిమాండ్లు నెరవేరడం లేదని సీఐటీయూ నాయకులు మండిపడుతున్నారు.

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా


గంట్యాడలో ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

గంట్యాడ: గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు శుక్రవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ల ఖాతాలకు ప్రభుత్వమే నేరుగా జీతాలు జమ చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిక్షా బళ్లకు మరమ్మతులు చేయించాలని, రక్షణ పరికరాలు అందజేయాలని రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ రమణమూర్తి వినతిపత్రం అందజేశారు.

వేతనాలు చెల్లించాలి



గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై సీఐటీయూ ఇప్పటికే పోరాటం ప్రారంభించింది. గత ఆరునెలలుగా జీతాలు అందుకోని గ్రీన్ అంబాసిడర్లు చాలామంది ఉన్నారు. వారు నిర్వహిస్తున్న విధులకు తగ్గట్టుగా యూనిఫాం, పాదరక్షలు,మాస్క్‌లు, కొబ్బరి నూనె తదితర సామగ్రి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పెండింగ్ వేతనాలు త్వరగా చెల్లించి, ఇకనుంచి నెల నెలా సక్రమంగా వేతనాలు అందించాలి. గ్రీన్ అంబాసిడర్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలి.

– చల్లా జగన్, సీఐటీయూ జిల్లా నాయకుడు

క్లుప్తంగా

గుండెపోటుతో వీఆర్‌ఓ మృతి


వీఆర్‌ఓ సింహాచలం (ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామ సచివాలయంలో వీఆర్‌ఓగా పని చేస్తున్న పోతల సింహాచలం(50) శుక్రవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారని ఇన్‌చార్జ్ తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. కుటుంబ సభ్యులు, తహసీల్దార్ తెలిపిన వివరాలు... వీఆర్‌ఓ సింహాచలం సచివాలయంలో విధులు ముగించుకుని సాయంత్రం తన స్వగ్రామం మరడాం చేరుకున్నారు. రాత్రి ఇంటి వద్ద భోజనం చేసి చేతులు శుభ్రం చేసుకుంటుండగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. 108 వచ్చిన తర్వాత ఆస్పత్రికి తరలిద్దామనుకొన్న సమయంలో మృతి చెందాడు. మృతుడికి భార్య లత, ఒక కుమార్తె ఉన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని రేవతిని అభినందిస్తున్న పీడీ కృష్ణంరాజు,హెచ్‌ఎం సునీత

కొత్తవలస: మండలంలోని దెందేరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని గొర్లె రేవతి బాలికల అండర్–14 విభాగంలో జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైందని పాఠశాల పీడీ కె.కృష్ణంరాజు శుక్రవారం తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో నిర్వహించనున్న నేషనల్ టోర్నమెంట్‌లో రాష్ట్ర జట్టు తరఫున విద్యార్థిని రేవతి ఆడనుందని చెప్పారు. విద్యార్థినిని హెచ్‌ఎం బి.సునీత, ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- 3 ద్విచక్రవాహనాలు స్వాధీనం


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన నిందితుడు గుమ్మడి సురేష్ అలియాస్ బండ సురేష్‌ను అదుపులోకి తీసుకుని మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం రాత్రి ఆమె విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం సోంపురం గ్రామానికి చెందిన సురేష్‌పై అనకాపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసులు, దేవరాపల్లి స్టేషన్‌లో ఒక కేసు, తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్, తెలంగాణా రాష్ట్రం నిజామాబాద్ జిల్లా బోధన్ పోలీస్ స్టేషన్ ఒక కేసు చొప్పున నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామం ఏలేరు కాలువ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సురేష్‌ను పట్టుకుని విచారించగా, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి


చిన్నారులతో ముచ్చటిస్తున్న ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి

దత్తిరాజేరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా, సకాలంలో పంపిణీ చేయాలని ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం ఆమె తనిఖీలు చేశారు. రికార్డు లు, పౌష్టికాహార స్టాక్‌ను పరిశీ లించారు. చిన్నారులతో ముచ్చటించి, వారితో ఏబీసీడీలు చెప్పించారు. సమయానికి కేంద్రాన్ని తెరవాలని, చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. ఆమె వెంట ఐసీ డీఎస్ సూపర్ వైజర్ ఇందిరా భవానీ ఉన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలని వినతి

చీపురుపల్లి: గరివిడిలో ఆర్‌ఓబీ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అండర్ బ్రిడ్జి నిర్మించాలని రైల్వేగేటు ప్రాంత వ్యాపారస్తులు, రామేశ్వరకాలనీ, బీపీ కాలనీ నివాసితులు విజ్ఞప్తి చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునను చీపురుపల్లిలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్‌ఓబీ కింద రైల్వే ట్రాకుపై పూర్తిగా రాకపోకలు నిలిపివేయడంతో ఇబ్బందులు తలెత్తాయన్నారు. రైల్వే ట్రాకుపై నడిచి వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, రైల్వే అధికారులు పూర్తిగా గోడలు నిర్మించేశారని వివరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో సంప్రదించి అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.

సమస్యలపై గళమెత్తిన గిరిజనులు


తహసీల్దార్ కార్యాలయంలో హెచ్‌డీటీకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర, ధారపర్తి, ఎస్.కోట పంచాయతీల పరిధిలోని గిరిజనులు తమ సమస్యలు పరిష్కరించాలని గళమెత్తారు. ఎస్.కోట ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నినాదాలతో హోరెత్తించారు. పోడు భూములకు పట్టాలివ్వాలని, గిరిజన ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేసి ఉపాధి పనులు కల్పించాలని, బొడ్డవర–చిట్టంపాడు రోడ్డును గాదెల్లోవ మీదుగా వేయాలని, ధారపర్తి రోడ్డు పనులను సత్వరం పూర్తిచేయాలని, పల్లపుదుంగాడలో సచివాలయం, ఆర్‌ఎస్‌కేలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన జన్ జాతీయ నిధులు ఖర్చు చేయాలని కోరారు. మూలబొడ్డవరను రెండు పంచాయతీలుగా విడదీయాలని, జీసీసీ ఆధ్వర్యంలో జీడిపిక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో దారపర్తి సర్పంచ్ బి.సన్యాసి, గిరిజన సంఘం నాయకులు గౌరీష్, అరుణ్‌కుమార్, పోలయ్య, సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 42మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన యువతతో కంపెనీల ప్రతినిధులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఏపీఎస్‌ఎస్‌డీసీ నేతృత్వంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. సుమారు 120 మంది యువతీ, యువకులు మేళాకు హాజరు కాగా, జాబ్ డీలర్స్, కన్విజీనియస్, మెడ్‌ప్లస్ కంపెనీలకు 42 ఎంపికయ్యారని జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న తెలిపారు.

భూసమస్యలు పరిష్కరించేందుకే...


బొండపల్లి: గొట్లాంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

బొండపల్లి: రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రాష్ట్ర చిన్న,మధ్యతరహా, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గొట్లాం సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 986 గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. భూసమస్యలను నాలుగు కేటగిరీల్లో విభజించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్,ఇన్‌చార్జి ఆర్డీఓ సుధారాణి, రెవెన్యూ సదస్సుల మండల ప్రత్యేక అధికారి ప్రమీలాగాంధీ, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వినియోగించుకోండి

శృంగవరపుకోట: రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సూచించారు.మరుపల్లిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆమె ప్రారంభించారు. తహసీల్దార్ అరుణకుమారి పాల్గొన్నారు.

పట్టాలివ్వండి

చీపురుపల్లి: పూర్వం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించాలని ఇటకర్లపల్లికి చెందిన 150 మంది రైతులు అధికారులను కోరారు.గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సర్పంచ్ మీసాల రమణ, ఎంపీటీసీ కుమారుడు మీసాల నవీన్, మాజీ ఎంపీటీసీ మీసాల అప్పలనాయుడు ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. రెవెన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి రాజేశ్వరి,ఆర్డీఓ సత్యవాణి, నోడల్ అధికారి హేమసుందర్, తహసీల్దార్ రాజారావు, ఎంపీడీఓ సరళ, సబ్‌రిజిస్ట్రార్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

- **దత్తిరాజేరు:** మండల కేంద్రంతో పాటు, గుచ్చిమి గ్రామంలోశుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. నోడల్ అధికారి శాంతకుమారి,ఇన్‌చార్జ్ తహసీల్దార్ వరప్రసాద్,ఆర్‌ఐ నారాయణరావు రైతుల నుంచి వినతులు స్వీకరించారు.
- **గుర్ల:** నడుపూరులో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు ప్రారంభించారు.అధికారులకు రైతులు వినతిపత్రాలు అందజేశారు తహసీల్దార్ ఆదిలక్ష్మి, సర్పంచ్ తాతమ్మ పాల్గొన్నారు.
- **వేపాడ:** రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. తహసీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యంలో పాటూరులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ అప్పారావు వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, సర్పంచ్ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ మంగమ్మ, ఉపసర్పంచ్ రమణమూర్తి, డీటీ సన్యాసినాయుడు,ఆర్‌ఐ రామలక్ష్మి పాల్గొన్నారు.
- **గజపతినగరం:** మండల ప్రత్యేక అధికారి పి.రమేష్ ఆధ్వర్యంలో మరుపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముందుగా అధికారులు గ్రామంలో ర్యాలీ చేశారు.అనంతరం సభ నిర్వహించి భూసమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించారు సర్పంచ్ రామలక్ష్మి, తహసీల్దార్ రత్నకుమార్, ఆర్‌ఐ అప్పలరాజు పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు మధ్య..

కొత్తవలస: రెల్లి గ్రామంలో పోలీస్ బందోబస్తు మధ్య శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యలపై తహసీల్దార్ నీలకంఠరావుకు రైతులు వినతులు సమర్పించారు.కొత్తవలస సీఐ షణ్ముఖరావు దగ్గరుండి కార్యక్రమాన్ని నడిపించారు. అలాగే లక్కవరపుకోట మండలంలోని ఖాసాపేటలో తహసీల్దార్ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

- **మెరకముడిదాం:**యాడిక, సాతాంవలస గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ అజూరఫీజాన్ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు. చీపురుపల్లి ఆర్డీఓ సత్యవతి హాజరై రెవెన్యూ సదస్సుల నిర్వహణ లక్ష్యాలను వివరించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని గజపతినగరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియ ర్ సివిల్ కోర్టు జడ్జి బి.కనక లక్ష్మి, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని వాడవాడలా అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత, వివిధ సంఘాల, పార్టీల నాయ కులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్


లక్కవరపుకోట: ఎల్.కోటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


బొండపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ చలం నాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు, ఎస్‌ఐ మహేష్, ఎర్రయ్య


గజపతినగరం: గజపతినగరం కోర్టులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జడ్జి కనకలక్ష్మి


చీపురుపల్లి: చీపురుపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పూలే అంబేడ్కర్ ఆశయ సాధన సమితి సభ్యులు


చీపురుపల్లి: చీపురుపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు


కొత్తవలస: కొత్తవలసలోని మూడురోడ్ల జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ రామస్వామి, నాయకులు


గంట్యాడ: మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రమణమూర్తి, ఉద్యోగులు


చీపురుపల్లి: చీపురుపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు



గజపతినగరం: గజపతినగరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జెడ్పీటీసీ తవుడు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెంకటరావు


చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు, వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీను, దళిత నాయకులు


దత్తిరాజేరు: మరడాం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూర్యనారాయణ,దళిత నాయకులు


గజపతినగరం: పురిటిపెంట గ్రామ సచివాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి,వివిధ సంఘాల నాయకులు


చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జైభీమ్ అసోసియేషన్ ప్రతినిధులు



శృంగవరపుకోట: ఎస్.,కోటలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


చీపురుపల్లిరూరల్(గరివిడి): వెదుళ్లవలసలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సమతా సైనిక్‌దళ్ ప్రతినిధులు



గజపతినగరం: గజపతినగరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులుర్పిస్తున్న జైభీమ్ భారత పార్టీ నాయకులు


వేపాడ: వేపాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు


శృంగవరపుకోట: ధర్మవరం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత నాయకులు

రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదు

చీపురుపల్లి: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తున్న రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ధాన్యం కొనుగోలుకు సంబంధించి సేవలు సకాలంలో అందించాలని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు చెప్పారు. స్థానిక రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించడంతో పాటు ధాన్యంలో తేమ శాతాన్ని సిబ్బంది పరీక్షిస్తున్న తీరును పరిశీలించారు.రైతు సేవా కేంద్రానికి రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే ట్రక్ షీట్‌లు సిద్ధం చేయాలని, అనంతరం రైతుల ఆధార్ అథెంటికేషన్‌ను పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏడీ కోటేశ్వరరావు, ఏఓ సీహెచ్.రఘునాథ్ తదితరులున్నారు.